క్లుప్తంగా

ఉద్యోగుల బకాయిలు వెంటనే చెల్లించాలి

రాజానగరం: రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులకు ఉన్న రూ.25 వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్టు ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు పాకలపాటి గిరిప్రసాద్‌వర్మ అన్నారు. దివాన్‌చెరువులోని గ్రామ సచివాలయంలో గురువారం జరిగిన ఉద్యోగుల సమావేశం జరిగింది. కార్యదర్శి వరసాల రామదాసు అధ్యక్షత వహించారు. గిరిప్రసాద్‌వర్మ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా బకాయిల చెల్లింపునకు ఆమోదయోగ్య ప్రతిపాదన చేశామన్నారు.

నిత్యావసర సరకుల అందజేత

పెదపూడి: నిరుపేద కుటుంబాలపై ప్రతి ఒక్కరూ దాతృత్వం కలిగి ఉండాలని రామేశ్వరం గ్రామంలోని రాజబాబు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కొమ్ము రాజబాబు అన్నారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ట్రస్ట్ అధ్వర్యంలో ఏపీత్రయం గ్రామ శివారు ఏటి గట్టుపై నివసిస్తున్న నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరకులు, ఆహార పదార్థాలను గురువారం అందజేశారు. ట్రస్ట్ ప్రతినిధులు కేపీఎస్ రాజు, పలివెల రాజేంద్రప్రసాద్, రాజేష్‌కుమార్, కె.మౌనిక పాల్గొన్నారు.

పాఠశాల దాత విగ్రహావిష్కరణ



పెద భూలోకం, సుందర మాణిక్యం దంపతుల విగ్రహాలు

బిక్కవోలు: మండలంలోని మెళ్లూరు గ్రామంలోని పాఠశాల దాత చవ్వాకుల పెద భూలోకం, సుందర మాణిక్యం దంపతుల విగ్రహాల ఆవిష్కరణ గురువారం ఘనంగా జరిగింది. సుమారు రూ.5 లక్షలతో సుందర మాణిక్యం కళావేదికను పెదభూలోకం కుటుంబ సభ్యులు నిర్మించారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి దీనిని ప్రారంభించారు. పాఠశాలకు పెద భూలోకం చేసిన సేవలను వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెదిరెడ్డి సత్యసాయిరాం, పాఠశాల హెచ్‌ఎం జి.లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు గురువారం నషా ముక్త్ భారత్ ప్రతిజ్ఞ చేశారు. స్వాతంత్య్ర ఉద్యమంలో దేశభక్తుల త్యాగాలు అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు జరిగాయి. హర్ ఘర్ తిరంగా బ్యానర్, జెండాలతో అధ్యాపకులు, విద్యార్థులు కళాశాల నుంచి దత్తత గ్రామమైన నాగరత్నం కాలనీ వరకు ర్యాలీ నిర్వహించారు. కాలనీ వద్ద మానవహారంగా ఏర్పడి జాతీయ జెండా ప్రాముఖ్యాన్ని వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ హరే రామకృష్ణ, అధ్యాపకులు డాక్టర్ నాగేశ్వర రావు, డాక్టర్ మాధవ్, వెంకటేష్, ఫణీంద్ర కుమార్, శివదుర్గా ప్రసాద్, ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ ఎం సుధామయి పాల్గొన్నారు.

ఐదు అడుగులకు మించి విగ్రహాలు పెట్టవద్దు

బిక్కవోలు: వినాయక చవితి సందర్భంగా ఐదు అడుగులకు మించి విగ్రహాలు పెట్టవద్దని ఎస్సై వాసంశెట్టి రవిచంద్ర కుమార్ తెలిపారు. గురువారం మండలంలోని కొమరిపాలెం గ్రామంలో పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, వినాయక చవితిని పురస్కరించుకుని ప్రశాంత వాతావరణంలో వేడుకలు నిర్వహించుకోవాలన్నారు. గతంలో జరిగిన అవాంఛనీయ సంఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏవిధమైన అశ్లీల కార్యక్రమాలు నిర్వహించకుండా కమిటీ బాధ్యులు బాధ్యత తీసుకోవాలన్నారు. సర్పంచ్ వాసంశెట్టి రవికుమార్, దార్వంపూడి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఎగరాలి.. మువ్వన్నెల జెండా..

- రంగురంగుల జెండాలతో స్కూళ్ల అలంకరణ
- దుకాణాల్లో జెండా, అలంకరణ సామగ్రి విక్రయాలు
- స్వాతంత్య్ర వేడుకలకు ఊరువాడా సిద్ధం

షిర్డీ సాయినాథుడికి త్రివర్ణాలంకరణ



అనపర్తిలో త్రివర్ణ పతాకం, జెండాల అలంకరణలో సాయిబాబా వారు

అనపర్తి: పాత ఊరిలో ఉన్న బాల రాజేశ్వరీ పీఠంలో కొలువుదీరిన షిర్డీ సాయిబాబా వారికి స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేకంగా అలంకరించారు. గురువారం ఆకుపచ్చ, తెలుపు, కాషాయం రంగుల వస్త్రాలతో బాబావారిని అలంకరించి, మకర తోరణానికి జెండాలు అమర్చి తమ దేశభక్తిని చాటుకున్నారు పీఠం నిర్వాహకులు రెడ్డి సతీష్. భక్తులకు ఈ అలంకరణ విశేషంగా ఆకట్టుకుంది.

బిక్కవోలు: ఏటా ప్రతి భారతీయుడికి పెద్ద పండగ స్వాతంత్య్ర దినోత్సవం. శుక్రవారం ఈ వేడుకలను ఉత్సాహంగా జరుపుకొనేందుకు నియోజకవర్గంలోని అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట మండలాల్లోని ఊరూవాడా సిద్ధమయ్యాయి. ఈ తరుణంలో మార్కెట్‌లో వివిధ ఆకారాల్లో జాతీయ పతాకాలు, రంగురంగుల అలంకరణ సామగ్రిని పెద్దలూ, పిల్లలూ ఆసక్తిగా కొనుగోలు చేశారు. ముఖ్యంగా చేతికి వేసుకునే బ్యాండ్లు, చొక్కా జేబుకు తగిలించుకునే కాగితపు జెండాలు వంటి వాటిని వ్యాపారులు అందుబాటులో ఉంచారు. అంతేకాకుండా వివిధ ఆకృతుల్లో మెటల్‌తో చేసిన జెండాలు, టేబుల్‌పై ఉంచే జెండాలు, కాషాయం, తెలుపు, ఆకుపచ్చ రంగులతో కూడిన దండలు విక్రయించారు. పలు పాఠశాలల్లో స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల సహకారంతో ఇప్పటికే పూర్తి చేశారు. విద్యార్థులకు జాతీయ గీతాలాపన, పరేడ్, జెండా వందన సమర్పణపై తర్ఫీదు ఇచ్చారు. అందుబాటు ధరల్లో జెండాలు, బ్యాడ్జీలు ఉండటంతో, విద్యార్థులు, యువకులు వాటిని కొనుగోలు చేశారు.



కాపవరం ఉన్నత పాఠశాల వద్ద నమూనా పరేడ్ నిర్వహిస్తున్న విద్యార్థులు



కాపవరం పాఠశాలలో క్లాస్ రూంను అలంకరిస్తున్న విద్యార్థినులు



బిక్కవోలులో జెండాలు, అలంకరణ సామగ్రి విక్రయిస్తున్న వ్యాపారి

తరగతి గదుల ముస్తాబు

విద్యార్థులు స్వయంగా తమ పాఠశాలల్లో తరగతి గదులు శుభ్రం చేశారు. వివిధ రంగుల కాగితాలు, జెండాలతో ఆకర్షణీయంగా అలంకరించారు. విద్యార్థులు సొంత ఖర్చులతో రంగులు, జెండాలు కొనుగోలు చేసి ముస్తాబు చేసుకున్నారు. ఒక్కరోజులోనే పాఠశాలల రూపురేఖలు మార్చేశారు. దీంతో రంగురంగుల తరగతి గదులు దర్శనమిస్తున్నాయి. కనీసం ఉపాధ్యాయుల ప్రమేయం కూడా లేకుండానే విద్యార్థులు తమ క్లాస్ గదులను తీర్చిదిద్దుకున్నారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా జెండాలతో అలంకరించడానికి గురువారం విద్యార్థులంతా కలసికట్టుగా పాఠశాలను అందంగా తీర్చిదిద్దిన తీరును చూసి ఉపాధ్యాయులు, గ్రామస్తులు వారిని అభినందించారు.

భారీ త్రివర్ణ పతాకం



కళాశాలలో ఏర్పాటు చేసిన భారీ జాతీయ జెండా

రాజానగరం: స్వాతంత్య్ర సంబరాల్లో భాగంగా స్థానిక కేఎల్ఆర్ లెనోరా దంత వైద్య కళాశాలలో 72 అడుగుల పొడవు, 48 అడుగుల వెడల్పుతో కూడిన జాతీయ జెండాను గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో గ్రామంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ జరిగింది. అనంతరం జాతీయ భావాన్ని, సృజనాత్మకతను ప్రతిబింబించేలా రంగోలీ, క్విజ్ పోటీలు, పోస్టర్ ప్రెజెంటేషన్లు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ నాగమణి, డైరెక్టర్ నాగార్జున రెడ్డి, ప్రిన్సిపాల్ విశ్వప్రకాష్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మా స్కూల్ భలేగా ఉంది



స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులమంతా కలిసి మా తరగతి గదులను శుభ్రం చేసుకున్నాం. మా పాఠశాల ఆట స్థలంలో జెండాలను అందంగా కట్టారు. ఎంతో ఆనందం కలిగిస్తోంది.

– జి.నవ్యశ్రీ, విద్యార్థిని, కాపవరం

అంతా కలిసి పని చేశాం



అందరం తలా కొంత డబ్బులు వేసుకుని రంగులు జెండాలు కొనుగోలు చేశాం. గదులను శుభ్రం చేశాం. రంగుల జెండాలతో అందంగా ముస్తాబు చేశాం. స్వాతంత్య్ర వేడుకల ఏర్పాట్లపై శిక్షణ తీసుకున్నాం.

– ఎ.జోయ్ సుహాస్, విద్యార్థి, కాపవరం

ప్రత్యేకాలంకరణలో ఆంధ్రా షిర్డీసాయి



బిక్కవోలు: మండలంలోని బలభద్రపురం గ్రామంలో కొలువైన ఆంధ్రా షిర్డీ సాయిబాబా మందిరంలో బాబావారికి ప్రత్యేకాలంకరణ చేశారు. శ్రావణ మాసం గురువారం పురస్కరించుకుని భారీగా భక్తులు బాబావారిని దర్శించుకున్నారు. ముందుగా అభిషేకాలు, హారతులు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు మందిర కమిటీ తరపున అన్న సమారాధన నిర్వహించినట్టు కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు సబ్బెళ్ల పురుషోత్తమరెడ్డి తెలిపారు.

సత్యసాయి ఉత్సవాలు ప్రారంభం

పెదపూడి: భగవాన్ సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని సత్యసాయి బాబా సేవా సమితి కాకినాడ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ గోవిందరాజులు అన్నారు. సంపర గ్రామంలో సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి.

అంగన్‌వాడీ భవనం ప్రారంభం

బిక్కవోలు: మెళ్లూరు గ్రామంలోని అంగన్‌వాడీ భవనాన్ని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి గురువారం ప్రారంభించారు. సుమారు రూ.10 లక్షలు నిధులతో ఈ భవనాన్ని నిర్మించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తేతలి సుమ, ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మహా కుంభాభిషేకం

బిక్కవోలు: కొమరిపాలెంలోని కనకదుర్గమ్మ తల్లి ఆలయం వద్ద శుక్రవారం మహా కుంభాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, పారిశ్రామికవేత్తలు కొవ్వూరి పాపారెడ్డి, మల్లిడి పెద్దిరెడ్డి తెలిపారు. ఏటా శ్రావణ మాసం ఆఖరి శుక్రవారం నిర్వహించే ఈ మహా కుంభాభిషేకం ఈ ఏడాది నాలుగో శుక్రవారం నిర్వహిస్తున్నట్లు వివరించారు. గోదావరి జలాలతో మహిళలు ఉదయం నుంచి రాత్రి వరకు అమ్మవారిని అభిషేకం చేస్తారన్నారు. గ్రామస్తులే కాకుండా, పరిసర గ్రామాల నుంచి భారీగా భక్తులు తరలి వస్తారన్నారు. భక్తుల కోసం బలభద్రపురానికి చెందిన కొవ్వూరి వెంకటరెడ్డి, వెంకయ్యమ్మ దంపతులు, కొవ్వూరి సతీష్‌రెడ్డి, శ్రీదేవి దంపతుల సహకారంతో అన్న సమారాధన నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి సంబరాలా?

- పులివెందుల, ఒంటిమిట్టలో జరిగినవి ఎన్నికలా!
- అభ్యర్థి కూడా ఓటు వేయలేని పరిస్థితి
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



అనపర్తి: కడప జిల్లా పులివెందుల, ఒంటిమిట్టల్లో జరిగిన ఉప ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి ఏదో ఘనకార్యం సాధించినట్టు సంబరాలు చేస్తోందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ధ్వజమెత్తారు. 14 నెలల పాలనలో ప్రజలను అన్ని రకాలుగా వంచించిన కూటమి ప్రభుత్వం.. కేవలం జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో గెలిచామన్న మాట కోసం యంత్రాంగమంతా దిగజారి, అడ్డదారులు తొక్కిందని విమర్శించారు. పులివెందుల ప్రజలు ఓడిస్తారన్న భయంతో పోలీసుల అండతో దౌర్జన్యాలకు దిగిందని మండిపడ్డారు. ఏకంగా కలెక్టర్, డీఐజీ స్థాయి అధికారులు రంగంలోకి దిగి, స్థానిక ఓటర్లను భయపెట్టి, వారిని ఓటు వేయనివ్వకుండా చేసిన దృశ్యాలు సామాజిక మాధ్యమాలను షేక్ చేశాయన్నారు. ఓటర్లను భయభ్రాంతులకు గురి చేసి, కలెక్టర్ సాక్షిగా దొంగ ఓట్లు వేసింది వాస్తవం కాదా, దేశ చరిత్రలో ఇలాంటి ఎన్నికలు ఎక్కడైనా జరిగాయా అని ప్రశ్నించారు. ఈ గలీజు పనులన్నీ సోషల్ మీడియా పుణ్యాన రాష్ట్ర, దేశ ప్రజలు కళ్లారా చూసినా సిగ్గులేని కూటమి సంబరాలు చూసి ప్రజలు ఏవగించుకుంటున్నారన్నారు. నాడు ప్రజాస్వామ్య పద్ధతిలో కుప్పంలో వైఎస్సార్ సీపీ గెలుపు వాస్తవం కాదా అని వ్యాఖ్యానించారు. ముందే వేసుకున్న పథకం ప్రకారం పక్క నియోజకవర్గాల నుంచి వచ్చిన వారితో ఓట్లు వేయించి, తమ స్థాయిని దిగజార్చుకున్నారని విమర్శించారు. ఓటింగ్ సవ్యంగా జరిగితే సీసీ టీవీ ఫుటేజ్, వెబ్ కాస్టింగ్ వీడియోలు బయట పెట్టడానికి భయమెందుకని ఆయన ప్రశ్నించారు.

ఎదుగుదల, పతనానికి ఆలోచనలే కారణం

నటుడు ప్రదీప్ కొండిపర్తి



ప్రదీప్‌కి జ్ఞాపికను అందజేస్తున్న నిర్వాహకులు

రాజానగరం: విద్యార్థి ఉన్నతంగా ఎదగాలన్నా, పతనమవ్వాలన్నా అతని ఆలోచనలే కారణమవుతాయని రచయిత, మోటివేటర్, నటుడు ప్రదీప్ కొండిపర్తి అన్నారు. భూపాలపట్నం, రైట్ ఇంజినీరింగ్ కళాశాలలో పవర్ యువర్ మైండ్-మై లైఫ్ ఈజ్ మై ఛాయిస్ అనే అంశంపై గురువారం విద్యార్థులకు మోటివేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ పాజిటివ్ ఆలోచనలతో ఎంచుకున్న లక్ష్యాలను సాధించి, ఉన్నత శిఖరాలను అందుకోవాలన్నారు. విద్యార్థి దశ ప్రాధాన్యం, ఉన్నతంగా ఎదగడానికి అనుసరించాల్సిన మార్గాలు, నడవడిక తదితర వాటిపై అవగాహన కల్పించారు. కరస్పాండెంట్ అడ్డాల శ్రీహరి అధ్యక్షత వహించారు. చైర్మన్ సాయిరాధాకృష్ణ, ప్రిన్సిపాల్ భాస్కర్ ముత్యాలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సొసైటీ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం

బిక్కవోలు: పందలపాక గ్రామంలోని సొసైటీ త్రిసభ్య కమిటీ ప్రమాణం స్వీకారం గురువారం జరిగింది. అధ్యక్షుడిగా పడాల సూర్యనారాయణరెడ్డి, సభ్యులుగా గుణ్ణం శ్రీనివాసచౌదరి, కర్రి సత్యనారాయణ ప్రమాణ స్వీకారం చేశారు.

సీతానగరం: వంగలపూడి పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం గురువారం జరిగింది. చైర్‌పర్సన్‌గా మద్దిపాటి సుజీవరాజు, పర్సన్లుగా మత్యం విజయలక్ష్మి, మద్దంశెట్టి వీరవెంకట్రావు ప్రమాణ స్వీకారం చేశారు.

యూరియా కోసం రైతుల తిప్పలు



రాపాక సొసైటీకి యూరియా కోసం తరలివచ్చిన రైతులు

సీతానగరం: మండలానికి చెందిన రైతులకు యూరియా తిప్పలు తప్పడం లేదు. ఎరువుల కొరత ఏర్పడిందనే ఉద్దేశంతో.. యూరియా బస్తాలు వచ్చిన వెంటనే రైతులు వాటిని తరలించుకుపోతున్నారు. వచ్చిన బస్తాలు 200 లు ఉంటే, వీటికోసం 500 మంది రైతులు క్యూలో పోటీ పడుతున్నారు. అధికారులు యూరియా దిగుమతి చేసుకోవడంలో విఫలమయ్యారని రైతులు మండిపడుతున్నారు. గురువారం రాపాక సొసైటీకి పది టన్నుల (225 బస్తాలు) యూరియా వచ్చింది. విషయం తెలుసుకున్న రాపాక, నల్గొండకు చెందిన సుమారు 500 మంది రైతులు అక్కడకు చేరుకున్నారు. 225 బస్తాల యూరియాను ఒకొక్క రైతుకు ఒకటి చొప్పున అఫీషియల్ చైర్‌పర్సన్ కృష్ణమోహన్ సమక్షంలో సీఈవో కాట్నం వెంకటేశ్వర రావు అందించారు. సొసైటీకి వచ్చిన యూరియా రైతులకు సరిపోలేదని నల్గొండ సర్పంచ్ భర్త గంగాధర్ ఏడీఏకు ఫోన్ ద్వారా సమాచారమిచ్చారు. రెండు రోజుల్లో సొసైటీకి యూరియా పంపిస్తామని ఏడీఏ ఎస్ జయరామలక్ష్మి తెలిపారు. ఏవో గౌరీదేవి విలేకరులతో మాట్లాడుతూ, మండలంలో నాలుగు సొసైటీకు పది టన్నుల చొప్పున యూరియా అందించారన్నారు. సొసైటీలకు మరలా యూరియా పంపిస్తారని చెప్పారు.

చవితి ఉత్సవాలకు రాట ముహూర్తం



అనపర్తిలో రాట ముహూర్తం చేస్తున్న భక్తులు

అనపర్తి: రావి చెట్టు వద్ద కొలువైన విజయ గణపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే వినాయక చవితి మహోత్సవాలకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవ ఏర్పాట్ల పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా గురువారం ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఆవరణలో రాట మంచి ముహూర్తం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు కర్రి రామారెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త తేతలి రాధాకృష్ణారెడ్డి, తేతలి నారాయణరెడ్డి, మల్లిడి ఆదినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విమానాశ్రయం.. త్రివర్ణ శోభితం



త్రివర్ణ వెలుగులు విరజిమ్ముతున్న విమానాశ్రయం

కోరుకొండ: స్వాతంత్య్ర వేడుకల్లో భాగంగా మధురపూడిలోని విమానాశ్రయం జాతీయ సమైక్యతను చాటేలా రూపుదిద్దుకుంది. గురువారం విమానాశ్రయాన్ని జాతీయ జెండాలోని మూడు రంగులతో తీర్చిదిద్దారు. వివిధ విభాగాలకు చేసిన అలంకరణలతో తీర్చిదిద్దిన విమానాశ్రయం ప్రయాణికులను ఆకట్టుకుంది. శుక్రవారం ఉదయం 8–45కు జెండా ఆవిష్కరణ జరుగుతుందని విమానాశ్రయ ఇన్‌చార్జి డైరెక్టర్ ఎస్‌కే శ్రీకాంత్ తెలిపారు. ఈ నెల రెండు నుంచి హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించి, ప్రయాణికులకు జాతీయ జెండాలు, చేతిబ్యాండ్లను అందజేసినట్టు చెప్పారు.

వివాహిత అదృశ్యం

సీతానగరం: రఘుదేవపురానికి చెందిన వివాహిత కొమ్మరపు లీల అదృశ్యమైనట్టు కేసు నమోదు చేశామని హెచ్‌సీ ఆకుల వీరవెంకట సత్యనారాయణ గురువారం తెలిపారు. ఆయన వివరాల మేరకు, కొమ్మరపు లీలకు వివాహం కాగా, ఇద్దరు పిల్లలున్నారు. ఉపాధి నిమిత్తం భర్త హైదరాబాద్‌లో ఉంటున్నాడు. లీలకు పెళ్లికి ముందే మరో వ్యక్తితో ప్రేమ వ్యవహారం ఉంది. పుట్టింటికి వచ్చిన లీల ఈ నెల మూడున ఇంటి నుంచి వెళ్లింది. అదే రోజు నుంచి లీల ప్రేమికుడు కూడా కనిపించడం లేదు. ఈ మేరకు ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు హెచ్‌సీ తెలిపారు.

ఊరంతా కుండపోత

- రహదారులు జలమయం
- స్తంభించిన జన జీవనం
- ప్రయాణికులు, చిరు వ్యాపారులకు ఇబ్బందులు



జాతీయ రహదారిపై రాజానగరం వద్ద..



ముంపునకు గురైన శ్రీరామపురం రోడ్డు

రాజానగరం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో గురువారం మధ్యాహ్నం నుంచి కుండపోతగా వర్షం కురుస్తూనే ఉంది. దీంతో పల్లపు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. పలు ప్రాంతాల్లో రోడ్లపై కాలువలను తలపించే స్థాయిలో వర్షపు నీరు ప్రవహించింది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో ప్రయాణికులు, చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ముంపులో శ్రీరామపురం రోడ్డు

కుండపోత వర్షంతో మండలంలోని దివాన్‌చెరువు కూడలి నుంచి శ్రీరామపురం వెళ్లే రోడ్డు జంక్షన్ పూర్తిగా ముంపునకు గురైంది. మోకాలు లోతున వర్షపు నీరు నిలిచిపోవటంతో స్థానికులతో పాటు, ఆ రోడ్డుపై రాకపోకలు సాగించిన ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఈ ప్రాంతంలో సీసీ రోడ్డు వేసి, ఇరువైపులా పక్కా డ్రైన్లు ఏర్పాటు చేసినప్పటికీ, పల్లపు ప్రాంతాన్ని ఎత్తు చేయకపోవడంతో కొద్దిపాటి వర్షానికే ఇక్కడ ముంపు పరిస్థితి నెలకొంటుందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. మండలంలోని కానవరం, రాధేయపాలెం, తుంగపాడు, నరేంద్రపురం, కలవచర్ల, సూర్యారావుపేట రోడ్లపై కూడా వర్షపు నీరు భారీగా ప్రవహించింది.

పల్లపు ప్రాంతాలు జలమయం

రంగంపేట: మండలంలో గురువారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి కాస్తంత ఎండ, ఉక్కపోత ఉన్నప్పటికీ, మధ్యాహ్నానికి వాతావరణం ఒక్కసారిగా మారి భారీ వర్షం కురిసింది. సుమారు రెండు గంటల నుంచి ఐదు గంటల వరకూ దఫదఫాలుగా వర్షం కురవడంతో గ్రామాల్లోని వీధులన్నీ జలమయమయ్యాయి. పల్లపు ప్రాంతాల్లో మోకాల్లోతు నీరు నిలిచిపోయింది. పాఠశాలలు, కాలేజీలు వదిలే సమయం కావడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఏడీబీ రోడ్డులో ద్విచక్ర వాహనదారులు వర్షం కారణంగా ఎక్కడికక్కడ నిలిచిపోయారు. ఈ వర్షం మెట్ట ప్రాంతమైన రంగంపేట మండలంలోని పలు రకాల పంటలకు మేలు చేస్తుందని రైతులు తెలిపారు. వరి, మినుము పంటలతో పాటు, పామాయిల్, మొక్కజొన్న, పండ్లతోటలు, కూరగాయ పంటలకు మేలు జరుగుతుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.